**శ్రీజకు గోల్డ్ మెడల్**

గోవాలో జరిగిన ప్రతిష్ఠాత్మక డబ్ల్యూటీటీ ఫీడర్ కార్పస్ క్రిస్టీ టోర్నీలో తెలంగాణ యువ ప్యాడ్లర్ ఆకుల శ్రీజ స్వర్ణ పతకం సాధించింది. జనవరి 19న జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో శ్రీజ 3-0తో లిలీ చాంగ్ (అమెరికా)పై గెలుపొందింది. రెండుసార్లు జాతీయ టీటీ చాంపియన్‌గా నిలిచిన శ్రీజ తొలిసారి అంతర్జాతీయ టైటిల్‌ను గెలుచుకుంది.



# విజ్ఞానవంతులకు విశిష్ట పీఠం

*భారతీయ సాహిత్యంలో అత్యున్నత ప్రతిభ కనపరిచిన వారికి ఏటా కేంద్ర సాహిత్య అకాడమీ జ్ఞానపీఠ్ అవార్డును ప్రదానం చేస్తారు. రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్ జాబితాలో పేర్కొన్న 22 భాషలతో పాటు ఇంగ్లిష్‌లో రచనలు చేసిన భారత రచయితలకు అందిస్తున్నారు. జ్ఞానపీఠ్ అవార్డును టైమ్స్ ఆఫ్ ఇండియా వార్తాపత్రిక వ్యవస్థాపకులైన సాహు జైన్ కుటుంబం 1944లో ఏర్పాటు చేసింది. ఈ అవార్డును మరణానంతరం ఇవ్వరు.*

## 58వ జ్ఞానపీఠ్ అవార్డు

- జ్ఞానపీఠ్ అవార్డును 1965 నుంచి 1981 వరకు రచయితలు వారు రాసిన పుస్తకాలకు ఇచ్చారు.
- 1982 తర్వాత భారతీయ సాహిత్యానికి జీవితకాలం కృషి చేసిన వారికి ఇస్తున్నారు.
- 2018 నుంచి ఇంగ్లిష్‌లో రచనలు చేసిన వారికి కూడా ఇస్తున్నారు.
- జ్ఞానపీఠ్ గ్రహీతలకు రూ.21 లక్షల నగదు, వాగ్దేవి కాంస్య ప్రతిమ, పురస్కార పత్రం అందజేస్తారు.
- వాగ్దేవి కంచు విగ్రహాన్ని మధ్యప్రదేశ్‌లోని ధారానగరి నుంచి గ్రహించారు.
- జ్ఞానపీఠ్-2023కు ఇద్దరిని ప్రముఖ ఒడియా రచయిత, 47వ జ్ఞానపీఠ్ గ్రహీత (2011) ప్రతిభా రాయ్ అధ్యక్షతన 11 మంది సాహితీవేత్తలతో కూడిన కమిటీ ఎంపిక చేసింది. ఈ కమిటీ సభ్యుల్లో తెలుగు జర్నలిస్ట్ ఏ కృష్ణారావు కూడా ఉన్నారు.
- ఇప్పటి వరకు 58 సార్లు జ్ఞానపీఠ్‌ను ప్రకటించగా 63 మంది అందుకున్నారు.
- ఈ అవార్డు మొదటి గ్రహీత శంకర్ కురూప్ (మలయాళ రచయిత)
- 57వ అవార్డు గ్రహీత దామోదర్ మౌజో.
- 58వ జ్ఞానపీఠ్ 2023కు సంస్కృత భాషకు దక్కడం ఇది రెండో సారి. గతంలో 2006లో 42వ జ్ఞానపీఠ్ సత్యవ్రత శాస్త్రికి సంస్కృతంలో వచ్చింది.
- ఉర్దూ భాషకు రావడం ఇది ఐదోసారి. గతంలో 1969, 1989, 1997, 2008లో ఉర్దూలో జ్ఞానపీఠ్ అందజేశారు.
- ఇప్పటి వరకు 63 మంది జ్ఞానపీఠ్‌ను 16 భాషల్లో అందుకున్నారు.
- అత్యధికంగా హిందీ నుంచి 11 మంది, కన్నడ 8, బెంగాలీ, మలయాళం 6గురు చొప్పున అందుకున్నారు.
- తెలుగు నుంచి ముగ్గురు ఈ అవార్డును అందుకున్నారు.
- 1970లో 6వ వ్యక్తిగా విశ్వనాథ సత్యనారాయణ 'శ్రీమద్రామాయణ కల్పవృక్షం' పుస్తకానికి ఈ పురస్కారం అందుకున్నారు.
- 1988లో 24వ వ్యక్తిగా డా. సి. నారాయణ రెడ్డి రాసిన 'విశ్వంభర' పుస్తకానికి లభించింది.
- 2012లో 48వ వ్యక్తిగా రావూరి భరద్వాజ రాసిన 'పాకుడు రాళ్లు' పుస్తకానికి దక్కింది.
- ఈ పురస్కారం అత్యల్పంగా కశ్మీరీ, ఇంగ్లిష్ నుంచి ఒక్కొక్కరు మాత్రమే అందుకున్నారు.

### 58వ జ్ఞానపీఠ్ గ్రహీతలు

- జ్ఞానపీఠ్-2023 ఇద్దరిని వరించింది.
- ఉర్దూ కవి గుల్జార్, సంస్కృత పండితుడు జగద్గురు రామభద్రాచార్య లకు లభించింది. 2022కు గోవా రాష్ట్రానికి చెందిన దామోదర్ మౌజోకు దక్కింది.





### గుల్జార్

- ప్రముఖ ఉర్దూ కవి, ప్రసిద్ధ బాలీవుడ్ సినీ రచయిత, చలనచిత్ర దర్శకుడు సంపూరణ్ సింగ్ కాల్రా అలియాస్ గుల్జార్‌ను ఇప్పటికే ఎన్నో పురస్కారాలు వరించాయి. 1969లో తొలిసారి ఉర్దూలో అవార్డును అందుకున్నది ఫిరాఖ్ గోరఖ్‌పురీ. గుల్జార్ 2002లో సాహిత్య అకాడమీ అవార్డు, 2004లో పద్మభూషణ్, 2010లో గ్రామీ అవార్డు అందుకున్నారు. 2013లో హిందీ చలనచిత్ర రంగానికి చేసిన విశేష కృషికి దాదాసాహెబ్ ఫాల్కే లభించింది. ఐదు సార్లు జాతీయ ఫిలిం అవార్డు పొందారు. స్లమ్ డాగ్ మిలియనీర్, మాచిస్ (1996), దిల్ సే (1998), ఓంకార (2006), గురు (2007) చిత్రాల్లో ఆయన రాసిన పాటలకు పేరు ప్రఖ్యాతలు వచ్చాయి. గుల్జార్ దర్శకుడిగానూ రాణించారు. కోశిష్ (1972), పరిచయ్ (1972), ఇజాజత్ (1987) చిత్రాలతో పాటు టీవీ సీరియల్ మీర్జా గాలిబ్‌కు ఆయన దర్శకత్వం వహించారు. స్లమ్‌డాగ్ మిలియనీర్‌లోని 'జై హో' పాటకు 2009లో ఆస్కార్ దక్కింది. గుల్జార్ కవితలను కొత్త పుంతలు తొక్కించారు. మూడు లైన్ల పద్యాలను రచించి చరిత్ర సృష్టించారు. ఇప్పటికీ చిన్న పిల్లల కవిత్వంపై ఆయన పని చేస్తున్నారు.

### జగద్గురు రామభద్రాచార్య

- మధ్యప్రదేశ్‌లోని చిత్రకూట్‌లో తులసీ పీఠాన్ని స్థాపించారు. ఈయన బహుముఖ ప్రజ్ఞాశాలి, విద్యావేత్త, రచయిత, హిందూ ఆధ్యాత్మిక గురువుగా గుర్తింపు పొందారు. రామానంద పరంపరలో ప్రస్తుతం ఉన్న నలుగురు జగద్గురువుల్లో ఆయన కూడా ఒకరు. రామభద్రాచార్య అసలు పేరు గిరిధర మిశ్రా. రెండు నెలల వయస్సులో ఇన్ఫెక్షన్ వల్ల కంటి చూపు కోల్పోయారు. ఐదేళ్ల వయస్సులో భగవద్గీతను, ఎనిమిదేళ్ల వయస్సులో రామచరితమానస్‌ను కంఠస్థం చేశారు. 22 భాషల్లో మాట్లాడగలరు. సంస్కృతం, హిందీ, అవధీ, మైథిలీ తదితర భాషల్లో రచనలు చేశారు. 240కు పైగా పుస్తకాలు రాశారు. 2015లో ఆయన పద్మవిభూషణ్ అందుకున్నారు.

### విశేషాలు

- 1965లో తొలిసారి ప్రకటించారు.
- జ్ఞానపీఠ్‌ను భారత పౌరులకు మాత్రమే అందజేస్తారు.
- భారతీయ అధికార భాషల్లో దేనిలోనైనా రాసిన వారు జ్ఞానపీఠ్‌కు అర్హులు.
- ఒక భాషా సాహిత్యానికి ఈ పురస్కారం లభించిన తర్వాత రెండేళ్ల పాటు అదే భాషా సాహిత్యనికి ఈ పురస్కారాన్ని పరిశీలించరు.

### జ్ఞాన్‌పీఠ్ పొందిన మహిళలు

- ఆశాపూర్ణా దేవి (బెంగాలీ, 1976)
- అమృత ప్రీతమ్ (పంజాబీ, 1981)
- మహాదేవి వర్మ (హిందీ, 1982)
- ఖురతుల్ ఐన్ హైదర్ (ఉర్దూ, 1989)
- మహాశ్వేత దేవి (బెంగాలీ, 1996)
- ఇందిరా గోస్వామి (అస్సామీ, 2000)
- ప్రతిభా రే (ఒడియా, 2011)
- కృష్ణ సోబ్తి (హిందీ, 2017)
- 2004లో కశ్మీరీ నుంచి రెహమాన్ రాహి, 2018లో ఇంగ్లిష్ నుంచి అమితవ్ ఘోష్ మాత్రమే జ్ఞానపీఠ్ అందుకున్నారు.

- తొలి జ్ఞానపీఠ్ గ్రహీత జి. శంకర్ కురుప్. 'ఒడక్కుజుల్' అనే మలయాళ రచనకు లభించింది.
- జ్ఞానపీఠ అవార్డును అందుకున్న రెండో వ్యక్తి బీఎస్ బందోపాధ్యాయ. 1966లో 'గణదేవత' అనే బెంగాలీ రచనకు ఈ అవార్డును అందుకున్నారు.
- జ్ఞానపీఠ్ అందుకున్న తొలి మహిళ ఆశా పూర్ణాదేవి. 1976లో 'ప్రాథోమ్ ప్రాతిశృతి (ది ఫస్ట్ ప్రామిస్)' అనే బెంగాలీ రచనకు అందుకున్నారు.
- జ్ఞానపీఠ్‌ను అందుకున్న రెండో మహిళ అమృత పీతమ్. 1981లో 'కాగజ్ తే కాన్వాస్ (పేపర్ అండ్ కాన్వాస్)' అనే పంజాబీ రచనకు ఈ పురస్కారం అందుకున్నారు.
- జ్ఞానపీఠ్ అందుకున్న తొలి తెలుగు వ్యక్తి విశ్వనాథ సత్యనారాయణ. 1970లో 'శ్రీమద్రామాయణ కల్పవృక్షం' అనే రచనకు అందుకున్నారు.
- 49వ జ్ఞానపీఠ్ నుంచి ఇంగ్లిష్ రచనలకు కూడా అందజేస్తున్నారు. 2018లో ఇంగ్లిష్‌లో జ్ఞానపీఠ్ అందుకున్న తొలి రచయిత 'అమితవ్ ఘోష్'.
- 1967, 1973, 1999, 2006, 2009, 2023 సంవత్సరాల్లో జ్ఞానపీఠ్‌ను ఇద్దరి చొప్పున ప్రదానం చేశారు.

## జ్ఞానపీఠ్ గ్రహీతలు



| | |
|---|---|
| 1965 | జి.శంకర్ కురుప్ (మలయాళం) |
| 1966 | తారా శంకర్ బందోపాధ్యాయ (బెంగాలీ) |
| 1967 | ఉమాశంకర్ జోషి (గుజరాతీ) |
| 1967 | డా. కేవీ పుట్టప్ప (కువెంపు) (కన్నడ) |
| 1968 | సుమిత్రానంద్ పంత్ (హిందీ) |
| 1969 | ఫిరాఖ్ గోరఖ్‌పురీ (ఉర్దూ) |
| 1970 | విశ్వనాథ సత్యనారాయణ (తెలుగు) |
| 1971 | బిష్ణు డే (బెంగాలీ) |
| 1972 | రామదరీ సింగ్ దినకర్ (హిందీ) |
| 1973 | దత్తాత్రేయ రామచంద్ర బెంద్రె (కన్నడ) |
| 1973 | గోపీనాథ్ మొహంతి (ఒడియా) |
| 1974 | విష్ణు సఖారాం ఖాండేకర్ (మరాఠీ) |
| 1975 | పీవీ అఖిలాండం (అఖిలాన్) (తమిళం) |
| 1976 | ఆశాపూర్ణా దేవి (బెంగాలీ) |
| 1977 | కె. శివరామ్ కారత్ (కన్నడ) |
| 1978 | సచ్చిదానంద వాత్స్యాయన (హిందీ) |
| 1979 | బీరేంద్ర కుమార్ భట్టాచార్య (అస్సామీ) |
| 1980 | ఏకే పొట్టెక్కాట్ (మలయాళం) |
| 1981 | అమృత ప్రీతం (పంజాబీ) |
| 1982 | మహాదేవీ వర్మ (హిందీ) |
| 1983 | మాస్తీ వేంకటేశం అయ్యంగార్ (కన్నడ) |
| 1984 | తకజీ శివశంకర్ పిళ్లై (మలయాళం) |
| 1985 | పన్నాలాల్ పటేల్ (గుజరాతీ) |
| 1986 | సచ్చిదానంద రౌత్రాయ్ (ఒడియా) |
| 1987 | విష్ణు వామన్ శిర్వాద్కర్ (మరాఠీ) |
| 1988 | డా. సి. నారాయణ రెడ్డి (తెలుగు) |
| 1989 | ఖురతుల్ ఐన్ హైదర్ (ఉర్దూ) |
| 1990 | వినాయక్ కృష్ణ గోకాక్ (కన్నడ) |
| 1991 | సుభాష్ ముఖోపాధ్యాయ (బెంగాలీ) |
| 1992 | నరేష్ మెహతా (హిందీ) |
| 1993 | సీతాకాంత్ మహపాత్ర (ఒడియా) |
| 1994 | యూఆర్ అనంతమూర్తి (కన్నడ) |
| 1995 | ఎంటీ వాసుదేవన్ నాయర్ (మలయాళం) |
| 1996 | మహాశ్వేతా దేవి (బెంగాలీ) |
| 1997 | అలీ సర్దార్ జాఫ్రీ (ఉర్దూ) |
| 1998 | గిరీష్ కర్నాడ్ (కన్నడ) |
| 1999 | నిర్మల్ వర్మ (హిందీ) |
| 1999 | గురుదయాళ్ సింగ్ (పంజాబీ) |
| 2000 | ఇందిరా గోస్వామి (అస్సామీ) |
| 2001 | రాజేంద్ర కేశవ్‌లాల్ షా (గుజరాత్) |
| 2002 | డి. జయకాంతన్ (తమిళం) |
| 2003 | విందా కరందీకర్ (మరాఠీ) |
| 2004 | రెహమాన్ రాహి (కశ్మీరీ) |
| 2005 | కువర్ నారాయణ్ (హిందీ) |
| 2006 | రవీంద్ర కేళేకర్ (కొంకణి) |
| 2006 | సత్యవ్రత్ శాస్త్రి (సంస్కృతం) |
| 2007 | డా. ఓఎన్‌వీ కురుప్ (మలయాళం) |
| 2008 | అఖ్లాక్ మొహమ్మద్ ఖాన్ (ఉర్దూ) |
| 2009 | అమర్ కాంత్ (హిందీ) |
| 2009 | శ్రీలాల్ శుక్లా (హిందీ) |
| 2010 | చంద్రశేఖర్ కంబార (కన్నడ) |
| 2011 | ప్రతిభా రాయ్ (ఒడియా) |
| 2012 | రావూరి భరద్వాజ్ (తెలుగు) |
| 2013 | కేదార్‌నాథ్ సింగ్ (హిందీ) |
| 2014 | బాలచంద్ర నెమాడే (మరాఠీ) |
| 2015 | రఘువీర్ చౌదరీ (గుజరాతీ) |
| 2016 | శంఖ ఘోష్ (బెంగాలీ) |
| 2017 | కృష్ణ సోబ్తీ (హిందీ) |
| 2018 | అమితవ్ ఘోష్ (ఆంగ్లం) |
| 2019 | అక్కితం అచ్యుతన్ నంబూద్రి (మలయాళం) |
| 2021 | నీలమణి పూకన్ (అస్సామీ) |
| 2022 | దామోదర్ మౌజో (కొంకణి) |
| 2023 | గుల్జార్ (ఉర్దూ) |
| 2023 | జగద్గురు రామభద్రాచార్య (సంస్కృతం) |

**అనంతారపు కృష్ణయ్య,**
**డైరెక్టర్,**
**శ్రీసాయి కోచింగ్ సెంటర్,**
**కోదాడ,**
**9948750605**

